# నువ్వంటే నాకెంతో ఇష్టం

- శైలజామిత్ర



"ఏవండీ!...."...........

"ఏవండీ మిమ్మల్నేనండి... పిలుస్తుంటే పల్కరేం?" కాస్త గట్టిగా అంది కాంతం.

......

"ఊ.... సరే.... ఇంతలా పిలుస్తున్నా పలకడం లేదంటే..... మీకు మళ్ళీ ఆ నీరజ గుర్తుకు వచ్చిందేమో నాకు తెల్సులెండి. నేను పాతకాలం దానిలా ఉంటాననేగా... మీకంత లోకువైపోయాను... ఛీ.. మా అమ్మ ఎప్పుడో చెప్పింది... పట్నం వాళ్ళని నమ్మకే - అని" అని బాధ తారాస్థాయి నందుకొనేంతలో..

"అబ్బ... ఏంటే...... నీ గోల" విసుక్కున్నాడు రమణ.

"ఆ! ఏంటీ... నా బాధ మీకు గోలగా ఉందన్న మాట... అంతేలెండి ఎంతయినా" అంతలోనే కాంతం నోటికి అడ్డంపెట్టి

"ఆపు... ఇంతకీ నీకేం కావాలో చెప్పు... క్షణంలో కాకపోయినా కాస్త సమయం తీసుకుని అయినా తీర్చేస్తాను. అంతేగానీ దండకం, నీ ఏడుపుతో నన్ను విసిగించకు... అసలే... రేపటిలోగా రాసి పంపాల్సిన కథలో క్లైమాక్సు కుదరక సతమతమవుతున్నాను" అన్నాడు రాస్తున్న కాగితాలలో ఉన్న పాడ్‌ని పక్కన పడేస్తూ... రమణ.

"మరీ... మరీ..." అంటూ మెలికలు తిరిగి పోతున్న కాంతాన్ని చూస్తూ

"ఆ! మరీ... మరీ... ఆ రెండు మాటలూ చెప్పడానికా నన్ను ఇంతలా విసిగించావు".

"కాదండీ... మరి చెప్తాను... చెప్పాక నన్ను విసుక్కోకూడదు సరేనా!"

"అంటే నాకు చిరాకు కల్గించే విషయం చెప్తావన్నమాట... ఏదో ఒకటి త్వరగా చెప్పు." అన్నాడు గట్టిగా రమణ.

"మరి తిట్టరుగా" మూతి సున్నాలా చుట్టి...

"తిట్టనులే... చెప్పు... కాంతం.... నన్ను విసిగించకు ప్లీజ్" బతిమాలుకున్నాను.

"మరి.... మీరు ఎన్నో కథలు రాస్తారు కదా?"

"అవును రాస్తాను...ఏం? నీకు డౌటా?"

"అదేం కాదండీ..... ఆ కథల్లో అమ్మాయిల్ని గూర్చి కూడా రాస్తారుగా"

"ఆ! రాస్తాను. ఆడవాళ్ళను గూర్చి రాయకుంటే కథకు పరిపూర్ణత ఎక్కడుంటుందీ?"

"మరి... ఒక్కసారి... నన్ను గూర్చి ఒక కథ రాయచ్చుగా" అంది మెల్లగా... తిడతారేమోననే భయం ధ్వనించే గొంతుతో.

ఆ మాట వినగానే రమణ విరగబడి నవ్వాడు... ఏంటీ.... నీ గూర్చి కథ రాయాలా?" మరీ ఆ కోరికేంటోయ్! మరీ సిల్లీగా ఉంది... అయినా పల్లెటూళ్లో పుట్టి..... పల్లెటూళ్లో పెరిగిన నీకు పేడ తీయటం పిడకలు కొట్టడం తప్ప నీకేం ఎక్కువుందని, నీకేం తెలివితేటలున్నాయని నేను రాయాలి?"

ఆ మాటకు అహం దెబ్బ తిన్న కాంతం... "మరి నన్నెందుకు ప్రేమించి పెళ్ళి చేసుకొన్నారు?" అంది ఉక్రోషంగా.

"ఓ... అదా! ప్రతి మగాడికి ఆడది ఎంత తెలివితక్కువగా ఉంటే... అదీ అలాంటి భార్య దొరికితే ఇతరత్రా ఎలాంటి బాధలూ ఉండవు. చెప్పిన మాటల్లా వింటారు. ఎదురు సమాధానాలు ఉండవని జీవితసత్యాన్ని గ్రహించి, బుద్ధిగా పడి ఉంటావని నిన్ను పెళ్ళి చేసుకున్నాను. అంతే

తప్పు... మవ్వేమయినా డయానా అంత అందగ త్తెవనా కాదు, ఇందిరాగాంధీ అంత తెలివి ఉందనా కాదు సరేనా! ఇంకా నయం... నీ కథతో సరి పెట్టావు... నీమీద సీరియల్ రాయమన్నావు కాదు.... వెళ్ళు ..... లోపలికి వెళ్ళు... పిచ్చి పిచ్చి ఆశలేం పెట్టుకోకుండా టీనీళ్ళు కాస్త నా ముఖాన పడేయి'' అన్నాడు పేపర్‌లు అందుకుంటూ.... రమణ.

"మరి పెళ్ళి కాకముందు నేను అందంగా ఉన్నాను అన్నారుగా'' అంది అమాయకంగా.

"ఆ! అలాగే అంటాం.... అలా అనకపోతే నువ్వు మీ వాళ్ళతో పోరాడి... రచయితననే అభి మానంతో నాతో వచ్చేదానివా? అయినా ఇప్పుడు నువ్వేం తక్కువ తినలేదు. నాతోటి రచయిత్రి నీరజతో వరసకల్పి సాధించుకు తినటం లేదూ! అయినా పొద్దున్నే నన్ను ఇలా అరిపిస్తున్నావేం'' అరుస్తూ అక్కడుంచిన టీ తీసుకున్నాడు...

⁂ ⁂ ⁂

"నీరజా''....

"హల్లో మీరా! రమణగారూ...రండి'' అంటూ అక్కడున్న సోఫాపై ఉన్న పుస్తకాలు పక్కన పెడుతూ అంది నీరజ..

"ఏంటి? ఎంతవరకు వచ్చిందండీ మీ రచనలు''

"ఏదో.... మీ అంతవారు అందరూ అంటారా'' మెల్లగా నీరజ.

"ఏంటో... మీరు మరీ పొగిడేస్తున్నారు'' అన్నాడు ఇబ్బందిగా కూర్చుంటూ రమణ.

"ఇంతకీ మీకు ఏరకమయిన కథ కుదరలేదంటారు'' అడిగాడు నవ్వుతూ.

"అంతేకదండీ... మీరేదయినా సలహాలాంటిది ఏదైనా ఇవ్వకూడదూ'' అంది నీరజ చిరునవ్వుతో.

"నిజంగా - అంటున్నారా! లేక ఏడిపిస్తున్నారా?

"అబ్బే! ఏడిపించటం ఎందుకండీ! అయినా మీకేం రాదనా మీ ఉద్దేశ్యం... పైగా మా కన్నా సీనియర్ రైటర్... అంది కాఫీ అందిస్తూ నీరజ.

"థ్యాంక్సండీ! అయితే నా సలహా మీకెప్పుడూ ఉంటుంది. ఇట్స్ ఎ ప్రామిస్'' అన్నాడు రమణ సంబరపడిపోతూ.

"పోనీ... ఇప్పుడో సలహా మచ్చుకు తెలపరాదూ...'' అంది నీరజ... అక్కడున్న బుక్ వంక చూస్తూ.

"సలహాలు, సంప్రదింపులూ ఎందుకండీ.. కథకు వస్తువులాంటిది కావాలా ఏంటి? ఉదాహర ణకు నన్ను తీసికోండి... నా అలవాట్లు... అభిరు చులు తీసికోండి... వాటినే ఒక కథగా రాయండి'' అన్నాడు ఏదో ఒక సలహా ఉచితంగా ఇస్తున్నట్లు ఫోజులతో రమణ.

"మిమ్మల్నా! ఏంటండీ... మరీ జోక్స్ మీద జోక్స్ వేస్తున్నారు'' సరదాగా అంటున్నట్లు అంది నీరజ.

"జోక్స్... జోక్స్ ఏంటండీ? ఇందులో జోక్స్ ఏమున్నాయి...?'' తడబడుతూ అన్నాడు.

"లేకపోతే ఏంటండీ? కథ రాసేటంత ఎక్స్ట్రార్డినరీ క్వాలిఫికేషన్స్ మీకేం ఉన్నాయని? వందమంది రచయితలలో మీరూ ఒకరు.... చదువు పోనీ ఎక్కువ ఉందా? అంటే అప్ట్రాల్ గ్రాడ్యుయేషన్. పోనీ ఆదర్శవంతులా అంటే మీ చేతికింద పడి ఉంటుందని పల్లెటూరి అమ్మాయిని ప్రేమించినట్లు నటించి పెళ్ళి చేసుకొని... పెళ్ళికాని నాతో మీరంటే నాకెంతో ఇష్టం... ఇంట్లో భార్య పేరేగాని ఎలాంటి సుఖం లేదు పిచ్చి మొద్దు. మీరు సరేనంటే దానికి విడాకులిచ్చేస్తా అంటున్నారు. కనీసం కట్టుకొన్న భార్యనే ప్రేమ లేకుండా ప్రవర్తిస్తున్నారు. ఏదో నాల్గు కథలు రాసినంత మాత్రాన రచయిత అయిపోడు... స్వలాభం కోసం పెళ్ళి చేసుకున్నంత మాత్రాన అది పెళ్ళి ఆదర్శం అయిపోదు. పోనీ ఉద్యోగం అదయినా గవర్నమెంట్ సర్వీసా అంటే అదీ లేదు. ఇప్పుడు చెప్పండి. మీలో ఏ గుణాన్ని చూసి కథ రాయాలంటారు? రమణగారూ.... మీరేమీ అనుకోకండి... నాకెప్పుడు ఫ్రాంక్‌గా మాట్లాడటం అలవాటు....మీకూ తెలుసుగా'' అంది నవ్వుతూనే... నీరజ.

ఎవరో సాచి లెంపకాయ కొట్టినట్లయింది రమణకు... ముఖం కందగడ్డలా కందిపోగా వెర్రిన వ్వునవ్వుతూ... వస్తానండి నీరజగారూ అంటూ ఇంటి ముఖం పట్టాడు. ఈరోజు ఎవరి ముఖం చూసానురా అనుకొంటూ.

⁂ ⁂ ⁂

"ఏవండీ.... అలా ఉన్నారు? ఒంట్లో బాగాలేదా? ఏవండీ! మాట్లాడరేం! నేనేమయినా తప్పు చేశానా? ఇందాక నాపై కథ రాయమన్నానని కోపం వచ్చిందా? వద్దు లెండి నాకసలు బుద్ధిలేదు. కాఫీ తాగుతారా? మీరలా ఉంటే నాకెందుకో భయంగా ఉందండీ'' అంది కళ్ళ నీళ్ళు నిండుకోగా... కాంతం.

అంతా విన్న రమణ...."నీపైన నాకేం కోపం లేదు కాంతం. కాఫీ పట్టుకురా... కాస్త అలసటగా ఉంది అంతే...'' అంది సమాధానపరిచాడు.

ఆ సమాధానానికే సంబరపడిపోయిన కాంతం ఆనందంతో ఉబ్బి తబ్బిబ్బయిపోయింది.

రమణకు మనసు ఎంతో ఆందోళనగా ఉంది... నీరజ అన్నమాటలే చెవిలో గింగురుమం టున్నాయి. పల్లె, పట్నం అంటు న్నామే గానీ నాగరికత పేరుతో అహంకారం పెంచు కునేది పట్నం అయితే స్వచ్ఛమయిన ప్రేమ ముందు ఇవన్నీ ఏ పాటికి అని ఆలోచిస్తున్న రమ ణకు "ఇదిగో పాలు తీసికోండి'' అంటూ అందిం చింది కాంతం.

"పాలా! పాలెందుకు కాంతం?... కాఫీ తెమ్మన్నానుగా''

"వద్దులెండి... తలనొప్పికి ఎంతో నీరసంగా ఉండి ఉంటారు. పాలు తీసుకోండి. కాస్త ఓపికగా ఉంటుందని... మా అమ్మ అంటూ ఉండేది'' అంది అమాయకంగా కాంతం.

"కాంతం''.

"ఏంటండీ?''

"నామీద నీకెప్పుడూ కోపం రాదా?''

"కోపమా! ఎందుకండీ?''

"మరి నేను చీటికీమాటికీ కోప్పడుతూ ఉంటాగా''

"నాకెందుకో కోపం రాదండి ఎప్పుడయినా కాస్సేపు బాధ అనిపిస్తుంది.... కొద్దిసేపు అయ్యాక నాదే తప్పేమో అనిపించి ఊరుకుండిపోతాను... '' అంది చీర కొంగును నలుపుతూ.

"నాది తప్పని ఎప్పుడూ అనిపించదా?'' అడిగాడు కాంతం వైపు మురిపెంగా చూస్తూ.

"అనిపించదు'' అంది కాంతం నేలచూపులు చూస్తూ...

"అదే ఎందుకు అనిపించదు? చెప్పవా?'' అడిగాడు తలపైకి లేపుతూ.... రమణ...


"ఎందుకంటే... ఎందుకంటే... మరి... మరి... మీరంటే... మీరంటే.... నాకెంతో ఇష్టంగా...'' అంది కొత్త పెళ్ళి కూతురిలా తల దించుకొని సిగ్గుపడుతూ.

⁂ ⁂ ⁂

రమణకు మంచి సబ్జెక్ట్ కుదిరింది... అదే... ఒక నిష్కల్మషమయిన ప్రేమ.... స్వార్థం లేని ఆత్మీయత, చెరిగిపోని అనురాగం... మూడింటినీ మూర్తీభవించి ఉన్న తన భార్య కంటే... తన భార్య ఔన్నత్యంకంటే... ఇంకేముంటుందని? ఇక ఆల స్యం చేయటం ఇష్టం లేనట్లు "నువ్వంటే నాకెంతో ఇష్టం'' అనే పేరుతో కథను మొదలుపెట్టాడు...

⁂ ⁂ ⁂

కానీ రమణకు తెలియనిది ఒకటుంది. తాను కాంతాన్ని నిత్యం తూలనాడటం గమనించిన నీరజ... వారి కాపురం సరిదిద్దాలనే ఉద్దేశ్యంతో రమణను తూలనాడిందని.... తనకు భార్యకు అర్థం తెలిసేలా చేయాలని ప్రయత్నం చేసింది... ⁂



## కార్యరూపం ఏది?

జంధ్యాల మరణవార్త విని వెక్కి వెక్కి ఏడ్చిన వాళ్ళల్లో నరేష్‌తో బాటు బ్రహ్మానందం కూడా ముందున్నాడు. మంచిదే! అయితే జంధ్యాల అన్నం పెట్టాడు అని ఒప్పుకున్నాడు బ్రహ్మానందం. అంతవరకూ బావుంది, ఆ అన్నం పెట్టే ఆద్యుడికి ప్రతిగా ఏం చేస్తున్నాడు? ఎలా జంధ్యాల రుణం తీర్చుకుంటున్నాడు? అన్నది తేల్చి చెప్పాలి. లేకపోతే స్మశాన వైరాగ్యంలా మిగిలిపోతుంది. ఇతగాడి చర్య అంటున్నారు పరిశ్రమలో పలువురు ప్రముఖులు.